క్లుప్తంగా

పాతికేళ్ల క్రితమే ఆంగ్లం ప్రాధాన్యతను గుర్తించాం



మాట్లాడుతున్న ఆర్ఐ అమీనాబేగం

ఒంగోలు: పాతికేళ్ల క్రితమే ఆంగ్లం ప్రాధాన్యతను గుర్తించామని ఆర్ఐ అమీనాబేగం అన్నారు. స్థానిక అన్నవరప్పాడులోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్లో సోమవారం నిర్వహించిన హౌస్ ఇనాగరేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హౌస్ ఇనాగరేషన్ సిస్టం గురించి వివరించారు.

పీఏ తల్లి మృతికి మంత్రి సురేష్ సంతాపం

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ వ్యక్తిగత సహాయకుడు (పీఏ) శ్యాం ప్రకాష్ మాతృమూర్తి విమలమ్మ సోమవారం మృతి చెందారు. ఆమె మృతికి మంత్రి సంతాపం వ్యక్తం చేశారు. విమలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, అమె కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

150 మందికి వైద్య పరీక్షలు

బేస్తవారిపేట: మండలంలోని ఖాజీపురంలో బేస్తవారిపేట పార్వతి నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎస్‌టీ హుస్సేన్ 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యశాల ఎండీ నర్రా సత్యనారాయణరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించాడని కేసు నమోదు

దర్శి: మద్యం సేవించి కులం పేరుతో దూషించాడని బండి వెలిగండ్ల గ్రామానికి చెందిన మక్కెన లోకయ్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కట్టా నాగార్జున అనే వ్యక్తిపై స్థానిక ఎస్సై రామకృష్ణ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు కంతా వీరయ్యకు చెందిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన సిమెంట్ దిమ్మెపై లోకయ్య కూర్చుని ఉన్నాడు. నాగార్జున అక్కడకు వచ్చి రాయి తీసుకుని లోకయ్యపై విసిరికొట్టి దిమ్మెపై కూర్చుంటావా అని కులం పేరుతో ధూషించినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రాహ్మణ సేవా సమాఖ్య ఉపాధ్యక్షుడిగా అన్నంరాజు

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చీరాలకు చెందిన అన్నంరాజు సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. కర్నూలులో జరిగిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సందర్భంగా సోమవారం బ్రాహ్మణ సేవా సమితి చీరాల సభ్యులు గంగవరపు ఆంజనేయవరప్రసాద్, చీరాల సుబ్రహ్మణ్యం, కొణికి చంద్రశేఖర్, డి.హరిప్రసాద్, కె.సత్యనారాయణ, స్వర్ణ మల్లిఖార్జున ప్రసాదర్, వారణాసి మల్లికార్జునరావు, బందా శక్తిధర్ అభినందించారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- డీఆర్‌డీఏ, వైఎస్సార్ కేపీ పీడీ రవికుమార్


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రవికుమార్

మద్దిపాడు: డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేస్తున్న ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని పీడీ రవికుమార్ సూచించారు. సోమవారం మద్దిపాడు కార్యాలయంలో సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఏపీఎంలు, సీసీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అన్ని రకాల రుణాలను నూరు శాతం రికవరీ చేయాలని ఆదేశించారు. తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగిస్తున్నారా.. లేదా..? అని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినేటర్ ఎం.విజయమ్మ, డీపీఎం నరసింహారావు, కృపారావు, బి.సుబ్బారావు, కృష్ణకుమారి, బాలసుబ్రహ్మణ్యం, ఆదిశేషు, పద్మావతి, ఏపీఎంలు నరేంద్ర, రవికుమార్, సుధాకర్, కోటేశ్వరరావు, సీసీలు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి


సమావేశంలో ప్రసంగిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు

ఒంగోలు టౌన్: అసంఘటిత రంగానికి చెందిన ముఠా కార్మికులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో టి.రాము అధ్యక్షతన ముఠా కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హమాలీలు, ముఠా కార్మికుల భద్రత, సంక్షేమం కోసం సమగ్రమైన చట్టం తీసుకురావాలని కోరారు. గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ లాంటి పథకాలతో ఆదుకోవాలన్నారు. కనీస వేతనాలు అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, యాజమాన్యాలు చేస్తున్న మోసాల నుంచి చట్టప్రకారం రక్షణ కల్పించాలని కోరారు. 55 కేజీల కంటే ఎక్కువ బరువులు మోయకూడదని చట్టం చెబుతున్నా యాజమాన్యాలు బేఖాతరు చేస్తున్నారని తెలిపారు. ముఠాకార్మికుల హక్కుల సాధన కోసం ఆగస్టు 2వ తేదీ విజయవాడలో నిర్వహిస్తున్న సదస్సులో హమాలీలు, ముఠాకార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతిపిత మహాత్మా గాంధీకి వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆదిలక్ష్మి, తంగి శ్రీనివాసులు, బసవ పున్నయ్య, ఖాశీం, శ్రీను, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బత్తాయి తోటలు పరిశీలించిన శాస్త్రవేత్త


బత్తాయి రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త శివ

ముండ్లమూరు: మండలంలోని పలు గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్ర ఉద్యానవన శాస్త్రవేత్త ఎం.శివ సోమవారం బత్తాయి తోటలను పరిశీలించారు. మండలంలోని నాయుడుపాలెం, తమ్మలూరు గ్రామాల్లో పర్యటించి ఎండు తెగులు, బంక తెగులు, ఆకు ముడత తెగుళ్లను గుర్తించారు. వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మా, మేమ్‌లో వృద్ధిపరిచిన పశువుల ఎరువును 5 నుంచి పదికిలోలు వేయాలన్నారు. బైటాక్స్ మూడు గ్రాములను లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు చెట్టు మొదలు వద్ద పోయాలన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఒంగోలు టౌన్: విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి అమ్మ ఒడి పథకం వర్తింపజేయాలని, ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా బస్ పాసులు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్, ప్రిన్సిపాల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్, నగర అధ్యక్ష, కార్యదర్శులు శశాంక్, హేమంత్, వెంకటేష్, వీరాస్వామి, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, గిరిజన సంఘ నాయకుడు శ్రీరామ శ్రీనివాసులు, కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య పాల్గొన్నారు.

బాలికల గురుకులంలో ప్రవేశాలు

పర్చూరు (చినగంజాం): మండలంలోని నాగులపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో బాలికలకు ప్రవేశాలు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ పీ విశ్వరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో చేరే విద్యార్థినులు తమ సర్టిఫికెట్లతో సంప్రదించాలని, నేరుగా అడ్మిషన్లు పొందవచ్చన్నారు. అదే విధంగా 10వ తరగతి మార్చి 2023 పాస్ అయిన విద్యార్థులకు మాత్రమే ప్రవేశముంటుందన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.1 లక్షలోపు ఉండాలన్నారు. వివరాలకు 97045 50091, 70321 32073 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

వరిగడ్డి వామి దగ్ధం

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామంలోని తూర్పు కొప్పెరపాడు రోడ్డులో సోమవారం రాత్రి వరిగడ్డి వామి దగ్ధం అయ్యింది. గడ్డివామి ఎకరన్నరం లోనిదని, దీని విలువ సుమారు రూ. 60 వేలు ఉంటుందని బాధిత రైతు బొల్లా పోలయ్య తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు. సమాచారం అందుకున్న అద్దంకి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పారు.

సాగు చేసిన పంటలనే నమోదు చేయాలి


మాట్లాడుతున్న బాలాజీనాయక్

దర్శి: ఈ క్రాప్‌లో సాగు చేసిన పంటలను మాత్రమే నమోదు చేయాలని దర్శి వ్యవసాయ సహాయ సంచాలకుడు కే బాలాజీనాయక్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో సబ్‌డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి ఈ క్రాప్ బుకింగ్ విధివిధానాలపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా 2023 ఖరీఫ్ సీజన్‌లో నూతన జియో రిఫరెన్స్ విధానంలో ఈ క్రాప్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకుని సచివాలయం, రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులకు తెలిసేలా ప్రదర్శించాలని సూచించారు. ప్రతిరోజూ సర్వే చేసే నంబర్లు ముందురోజు రైతులకు తెలియజేయాలన్నారు. రెవెన్యూ అధికారుల ద్వారా గ్రామాల్లో ఎంతమేర భూమి ఉంది, వ్యవసాయం, ప్లాట్లు, బంజరు భూముల వివరాలు ముందుగానే తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్‌తో కూడిన బృందాలు పంటపొలాన్ని సందర్శించి మాత్రమే పంట నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలినేనికి బొట్ల రామారావు కృతజ్ఞతలు


బాలినేనికి కృతజ్ఞతలు తెలుపుతున్న బొట్ల రామారావు

ఒంగోలు: జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించినందుకు బొట్ల రామారావు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఉదయం బాలినేనిని ఒంగోలులోని ఆయన నివాసంలో కలిసిన అనంతరం మీడియాతో రామారావు మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 550 ప్రాథమిక సహకార సంఘాలలో 450 సంఘాలు తమ యూనియన్‌లో సభ్యత్వం కలిగి ఉన్నాయన్నారు. రుణం తీసుకున్న ప్రాథమిక సంఘాల లబ్ధిదారులు వెంటనే బకాయిలు చెల్లించాలని, అలా చెల్లించిన వారే త్వరలో మంజూరయ్యే ఎన్‌సీడీసీ సబ్సిడీ రుణాలకు అర్హత పొందుతారని తెలిపారు. త్వరలోనే జిల్లాకు రూ.8 కోట్ల ఎన్‌సీడీసీ నిధులు మంజూరు చేస్తామని రాష్ట్ర ఫెడరేషన్ నుంచి సమాచారం అందిందన్నారు. ఆయన వెంట పీడీసీసీబీ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ బొట్ల సుబ్బారావు, రైతు విభాగం నాయకుడు మారెడ్డి సుబ్బారెడ్డి, వల్లం రెడ్డి రమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళులు


జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్థానికులు


ఒంగోలులో జాషువాకు నివాళులర్పిస్తున్న ప్రముఖులు

చీమకుర్తి: నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా సోమవారం చీమకుర్తి క్రిస్టియన్‌పాలెంలో వైఎస్ భారతి సేవా సమితి అధ్యక్షురాలు పాటిబండ్ల రాజసులోచన ఆధ్వర్యంలో స్థానిక మహిళలు ఘనంగా నివాళులర్పించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి సామాజిక రుగ్మతలపై జాషువా రచించిన సాహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.

ఒంగోలులో...

ఒంగోలు: గుణం లేనివాడు మాత్రమే కులం గొడుగు పడతాడని దివంగత కవికోకిల అన్నమాటలు నేటికీ జనామోదమని బండారు రామ నాట్యమండలి అధ్యక్షుడు అల్లూరు శాంతారావు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ గ్రంథాలయంలో గుర్రం జాషువా 52వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మానవత్వం లేనివాడు మతం ముసుగు వేస్తాడని, పసలేని వాడు ప్రాంతీయ భేదం చూపుతాడని, జనులంతా ఒక్కటే జనం అంతా ఒక్కటే అని భావించిన వారు అందరి వారు అవుతారని గుర్రం జాషువా పేర్కొన్నారంటూ కీర్తించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, కళాకారులు నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు, ఎస్.చంద్రశేఖర్‌బాబు, మిడసల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, దారా నారాయణ, జయరావు, కోటి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలు దేశానికే అప్రతిష్ట



నిరసన సభలో మాట్లాడుతున్న అరుణ

ఒంగోలు టౌన్: మణిపూర్‌లో స్త్రీలను నగ్నంగా ఊరేగించడం, సామూహిక అత్యాచారం చేయడం లాంటి ఘటనలతో దేశం సిగ్గుతో తలదించుకోవాల్సి వచ్చిందని నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక హౌసింగ్ బోర్డులోని నరసం కార్యాలయంలో నిర్వహించిన నిరసన సభలో ఆమె ప్రసంగించారు. ఈ ఘటనతో దేశంలో అమ్మతనం అవహేళనకు గురైందన్నారు. దేశంలోని కోట్లాది మంది మహిళల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిన నిందితులను కేంద్ర పాలకులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన దుశ్చర్యతో దేశంలోని మహిళలు అవమానభారంతో కుచించుకుపోయారని కవయిత్రి సింహాద్రి జ్యోతిర్మయి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలుగా మణిపూర్‌లో హింస జరుగుతుంటే పాలకులు ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. తెగల మధ్య పోరాటం మహిళలపై అత్యాచారాల పోరాటంగా మారడం బాధాకరమని కత్తి కృపావరం అన్నారు. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించి మణిపూర్ మహిళలకు న్యాయం చేకూర్చాలని, మణిపూర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. పలువురు కవయిత్రులు ఈ ఘటనపై తమ కవితలతో తీవ్ర నిరసన తెలిపారు.

అసత్యాలు మాని.. ఆధారాలుంటే నిరూపించు


మాట్లాడుతున్న ఉడుముల శ్రీనివాసులురెడ్డి

- ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం కాదు.. నిజాలు తెలుసుకో..
- టీడీపీ జమానాలో కమీషన్లు మింగిన ఘనుడు 'కందుల'
- నారా లోకేష్ ఆరోపణలను ఖండించిన మాజీ ఎమ్మెల్యే ఉడుముల

పొదిలి రూరల్: యువగళం బహిరంగ సభలో నారా లోకేష్ చేసిన ఆరోపణలకు ఆధారాలుంటే చూపాలని కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి సవాల్ చేశారు. సోమవారం పొదిలి ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నారా లోకేష్ ఆరోపణలను ఖండించారు. ఉడుముల మాట్లాడుతూ.. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవకుండా నిజాలు తెలుసుకుని మాట్లాడాలని లోకేష్‌కు హితవు పలికారు. తాను గానీ, ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డిగానీ ఎక్కడ ప్రభుత్వ భూములు ఆక్రమించామో, ఎవరి దగ్గర ట్యాక్స్ వసూల్ చేశామో దమ్ముంటే నిరూపించాలన్నారు. కేపీ, ఉడుముల కుటుంబాలు సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నాయని, అసత్య ఆరోపణలు చేసినంత మాత్రాన తమను దెబ్బతీయవచ్చనుకోవడం భ్రమేనన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పనుల్లో కమీషన్లు వసూల్ చేసిన ఘనుడు కందుల నారాయణరెడ్డి అని ధ్వజమెత్తారు. ఉడుముల ఆస్పత్రి ఏర్పాటు చేసిన స్థలం 1980లో గాంధీ అనే వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్ అయి ఉందని, దానిని 2013లో వెలిశెట్టి వెంకటేశ్వర్లు కొనుగోలు చేశారని, 2015లో తాము కొనే సమయానికే అక్కడ బిల్డింగ్ ఉందని, అందులో హీరో షోరూం, ఫర్నిచర్ షాపులు ఉన్నాయని స్పష్టం చేశారు. పొదిలి ప్రాంత ప్రజలకు మెరుగైనా వైద్య సేవలు అందించడానికి ఆస్పత్రి నిర్మిస్తే.. ఓర్వలేనితనంతో నిరాధారమైన ఆరోపణ చేయడం సరికాదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రాజీవ్ పల్లె బాటలో భాగంగా కొనకనమిట్ల మండలంలో 100 కిలోమీటర్ల మేర తారురోడ్లు నిర్మిస్తే.. టీడీపీ జమానాలో తువ్వపాడు నుంచి కొత్తపల్లి వరకు మాత్రమే రోడ్డు వేశారని గుర్తుచేశారు. సమావేశంలో ఎంపీపీ మురళీ, జెడ్పీటీసీ ఏడుకొండలు, పార్టీ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, కె.వెంకటేశ్వర్‌రెడ్డి, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

పాపులూరులో నేత్రదానం


దాత వెంకటేశ్వరరావు (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పావులూరు గ్రామానికి చెందిన ఆత్మకూరు వెంకటేశ్వరరావు (78) సోమవారం మరణించడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు అంగీకారం మేరకు దానం చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ పీ బద్రిరెడ్డి ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీకి సమాచారం అందించారు. కమిటీ వారు గుంటూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులను పిలిపించి మృతుని కార్నియాలను సేకరించారు. మృతుని కుటుంబ సభ్యులు భాస్కరరావు, రమేష్‌బాబు, సరోజినిలకు ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు, ట్రెజరర్ సాంబయ్యలు అభినందనలు తెలియజేశారు. ఇది క్లబ్ 513వ నేత్రదానం అని సభ్యులు తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి
దరఖాస్తుల ఆహ్వానం

కురిచేడు: మండలంలోని రైతులు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది పండ్లతోటలు పెంచేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ నాగప్రసాదు కోరారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, 5 ఎకరాలలోపు సాగుభూమి గల రైతులు, ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన వారు, బోరుబావి కలిగి విద్యుత్ సరఫరా ఉన్న వారు అర్హులని తెలిపారు. రైతులు వారి దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం జెరాక్సు, బ్యాంక్ ఖాతా పుస్తకం జెరాక్సు, ఆధార్‌కార్డు జెరాక్సు, ఉపాధి హామీ జాబ్‌కార్డు జెరాక్సు, పాన్‌కార్డు జెరాక్సు, పాస్‌పోర్టుసైజు ఫొటోలు 3, గ్రామ పంచాయతీ తీర్మానం తీసుకుని ఈ నెల 31వ తేదీలోపు గ్రామ పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ సహాయకుడు, ఏపీఓలలో ఎవరికైనా అందజేయవచ్చని తెలిపారు. ఈ పథకం ద్వారా మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, సపోటా, బత్తాయి, అల్లనేరేడు తోటలు పెంచవచ్చన్నారు. తోటలు సాగుచేసే రైతులకు గుంతలు తీసేందుకు, మొక్కలు నాటడానికి, మొక్కకు ఊత కర్ర కట్టడానికి, మొక్క కొనుగోలుకు, ఎరువులు వేయడానికి, నెల నెలా పర్యవేక్షణకు మూడు సంవత్సరాలపాటు ఉపాధి హామీ పథకం నుంచి డబ్బు చెల్లిస్తారని ఆయన తెలిపారు. ఉద్యానవనశాఖ ద్వారా మైక్రో ఇరిగేషన్ అందజేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు తుమ్మలచెరువులో చిన్న షరిగత్


తుమ్మలచెరువులో విద్యుద్దీపాలంకరణలో పీర్ల మఖానం

తర్లుపాడు: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పీర్లపండుగకు ప్రసిద్ధిగాంచిన తుమ్మలచెరువు గ్రామంలో మంగళవారం చిన్న షరిగత్ నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. పీర్ల పండుగకు రెండు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ షాజహాన్ రోడ్లకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించారు. గ్రామంలో వీధులన్నీ శుభ్రం చేయించారు. పీర్ల గుండం తవ్వించారు. మంగళవారం సాయంత్రం నుంచి పీర్ల గుండం ప్రారంభమవుతుంది. పెద్దఎత్తున గుండంలోనుంచి మంటలు ఎగిసిపడే సమయంలో భక్తులు పీర్లను ఎత్తుకుని అటు ఇటు తిరిగి గ్రామంలో ఊరేగిస్తారు. ఇప్పటికే గ్రామంలో ఇళ్లన్నీ బంధువుల రాకతో కళకళలాడుతున్నాయి.


మఖానంలో కొలువైన పీర్లు

పాల సేకరణ పెంచాలి


జగనన్న పాలవెల్లువపై సమీక్షిస్తున్న అధికారులు

కురిచేడు: జగనన్న పాలవెల్లువ కేంద్రాల ద్వారా పాలసేకరణ పెంచాలని ఎంపీడీఓ వసంతరావు నాయక్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, పశువైద్య సహాయకులు, వీఏఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో జగనన్న పాలవెల్లువ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేటు కేంద్రాల కన్నా జగనన్న పాలవెల్లువ కేంద్రాల్లో పాల ధర కూడా ఎక్కువగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మండలాన్ని మొదటిస్థానంలో నిలిపేలా ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, ఏపీఎం సైమన్, పంచాయతీ కార్యదర్శులు, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.